నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ శుక్రవారం 19 జూలై 2024 | ADILABAD NIRMAL


## మాజీ సర్పంచ్‌ను అభినందించిన కేంద్ర మంత్రి

ఇచ్చోడ, జూలై 18 : స్వచ్ఛత కోసం నిస్వార్థంగా పని చేస్తున్న మహిళా సర్పంచ్ గాడ్గె మీనాక్షికి సలాం అంటూ కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ట్విట్టర్(ఎక్స్)లో ట్వీట్ చేశా రు. ఇచ్చోడ మండలంలోని ముక్రా (కే) సర్పంచ్ తాజా మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి వర్షాకాలం వల్ల వచ్చే వ్యాధులు, దోమల నివారణకు గ్రామంలో మందును పిచికారీ చేశారు. గ్రామంలోని ప్రతి విధిలో స్వయానా పిచికారీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ గ్రామాలను స్వచ్ఛతగా ఉంచితే దేశం మొత్తం స్వచ్ఛగా ఉంటుందని, వ్యాధులు రాకుండా నివారించవచ్చని ట్విట్టర్ వేదికగా అభినందించారు.



కేంద్ర మంత్రి ట్విట్టర్(ఎక్స్)లో పోస్ట్ చేసిన ట్వీట్

## త్వరలో ఆదిలాబాద్‌కు సీఎం

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా
- లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశం


రిమ్స్‌ని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాట్లను పరిశీలిస్తూ సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూలై 18 : ఆదిలాబాద్ జిల్లాకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాలు ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రారంభించనున్న మహిళా శక్తి క్యాంటీన్, ఎంఆర్ఐ యంత్రం, కైలాస్‌నగర్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. పొరపాట్లు లేకుండా చూడాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీఎం బస, సమావేశం, లంచ్ వంటి వాటికి ఒక్కో అధికారికి బాధ్యత అప్పగించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్ కుమార్, డీఆర్‌డీఏ సాయన్న, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మార్కెట్ ఏడీ శ్రీనివాస్, డీఎస్‌వో కిరణ్‌కుమర్ ఉన్నారు.


రుణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

### 'రుణమాఫీ' ప్రారంభం

ఖానాపూర్ రూరల్, జూలై 18 : ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి రైతువేదికలో గురువా రం రుణమాఫీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్ఈడీలో కార్యక్రమాన్ని తిలకించా రు. తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు.

### సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఒకరిపై కేసు

దిలావర్‌పూర్, జూలై 18 : రైతు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తున్న సమయంలో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఒక యువకుడు ఇన్‌స్టాగ్రాం, సామాజిక మాధ్యమంలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ యువకుడిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో కట్కం రాజరెడ్డి, అర్గుల రమణ, కోడే నవీన్, నిమ్మ నగేశ్, గడ్డం నర్సరెడ్డి, మహేందర్, కోడే విజయ్‌కుమార్ ఉన్నారు.


దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న యువకులు

# 'రుణమాఫీ' గందరగోళం

### ఆదిలాబాద్ జిల్లాలో..

ఎదులాపురం, జూలై 18 : ఆదిలాబాద్ జిల్లాలోని 18,821 మంది రైతుల 18,353 కుటుంబాలకు రూ.120.79 కోట్ల రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎవరికైనా రూ.లక్ష రుణం ఉన్న కూడా తమ పేరు రుణమాఫీ లబ్ధిదారుల జాబితాలో లేకుంటే వారు తమ పంట రుణం అకౌంట్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో మండల కేంద్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలి. దరఖాస్తును పరిశీలించి 30 రోజుల్లో పరిష్కారం చూపుతారు. ఇతర సందేహాలు ఉంటే జిల్లా నోడల్ అధికారి ఎన్.రమేశ్ సెల్ నంబర్ 7288894003కి సంప్రదించాలి.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్, జూలై 18(నమస్తే తెలంగాణ) : తొలి రోజు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా రూ.లక్ష లోపు రుణాలు ఉన్న 30,106 మంది రైతులకు రూ.171.77 కోట్ల రుణమాఫీ అయినట్లు అధికారులు చెబుతున్నారు. బాసర మండలంలో 997, భైంసాలో 2,347, దస్తురాబాద్‌లో 1,322, దిలావర్‌పూర్‌లో 1,234, కడెంలో 2,164, ఖానాపూర్‌లో 1,457, కుభీర్‌లో 2,405, కుంటాలలో 1,124 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ అయినట్లు సమాచారం. లక్ష్మణచాంద మండలంలో 1771, లోకేశ్వరంలో 2157, మామడలో 1684, ముథోల్‌లో 1993, నర్సాపూర్(జి)లో 1065, నిర్మల్ రూరల్‌లో 1543, నిర్మల్ అర్బన్‌లో 104, పెంబిలో 571, సారంగాపూర్‌లో 2388, సోన్‌లో 1023, తానూర్‌లో 2757 మంది రైతులకు రుణమాఫీ అయింది.

## వచ్చిన వారికంటే రానివారే ఎక్కువ?

- ప్రామాణికం ఏంటో తెలుపని సర్కారు
- రూ.లక్షలోపు కొందరికే వర్తింపు..
- ప్రభుత్వ కొర్రీలతో సామాన్య రైతుల వర్రీ
- అర్హుల జాబితాపై కొరవడిన స్పష్టత
- ఉమ్మడి జిల్లాలో 96,043 రైతు కుటుంబాలకు రూ.572.15 కోట్లు రుణమాఫీ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తొలి విడుతలో రుణమాఫీ వివరాలు..

| జిల్లా | రైతు కుటుంబాల సంఖ్య | రుణమాఫీ అకౌంట్లు | డబ్బులు |
|---|---|---|---|
| మంచిర్యాల | 27,827 | 29,421 | రూ.154.39 కోట్లు |
| నిర్మల్ | 28,825 | 30,106 | రూ.171.77 కోట్లు |
| ఆసిఫాబాద్ | 21,038 | 22,000 | రూ.125.20 కోట్లు |
| ఆదిలాబాద్ | 18,353 | 18,821 | రూ.120.79 కోట్లు |
| మొత్తం | 96,043 | 1,00,348 | రూ.572.15 కోట్లు |

మంచిర్యాల, జూలై 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు, ఇప్పుడు చేస్తున్న దానికి పొంతన లేకుండా పోయింది. పూటకో మాట మారుస్తూ జనాలను గందరగోళంలో పడేస్తున్నది. రుణమాఫీ చేసి రైతులకు ఊరట కలిగిస్తుందనుకుంటే కొద్ది మందికే మాఫీ చేసి చేతులు దులుపుకున్నది. లక్ష రూపాయల లోపు రుణాలు మాఫీ చేసి, ఆ తరువాత మాఫీ చేయకుంటే మా పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు మాట మార్చినట్లే అప్పుడూ ఏదో కారణం చెప్తే ఏం చేసేదని ఆందోళన చెందుతున్నారు. కుటుంబమే యూనిట్‌గా తీసుకుని రుణాలను రద్దు చేయడం ద్వారా చాలా మందికి నష్టం వాటిల్లుతున్నది. కుటుంబంలో ఒకరికి మాత్రమే రుణమాఫీ అమలు కాగా.. మార్గదర్శకాల పేరిట, సాంకేతిక కారణాలతో చాలా మందికి నష్టం వాటిల్లనున్నది. సాగు కోసం తీసుకున్న అప్పులు కాంగ్రెస్ సర్కారు రద్దు చేస్తున్నదని అన్నదాతలు పెట్టుకున్న ఆశలు గల్లంతవుతున్నాయి. తొలి విడుతలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో 96,043 రైతు కుటుంబాలకు రుణమాఫీని వర్తింపజేశారు. కానీ.. రుణాలు తీసుకున్న వారి సంఖ్య ఇప్పుడు చేసిన మాఫీ కంటే మూడు, నాలుగింతలు ఎక్కువగా ఉంది. ఇందులో చిన్న, సన్నకారు రైతులు చాలా మంది రుణమాఫీ రాదని తెలిసి తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. రైతులకు రుణభారాన్ని తగ్గించడాన్ని బాధ్యతగా తీసుకోవాల్సిన సర్కారు చేతులు దులుపుకుంటుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నిబంధనల పేరిట కోత

రైతు ప్రయోజనాలను విస్మరించి ఇచ్చిన హామీని అమలు చేశామని చెప్పుకునేందుకే కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేసినట్లు ఉంది. మార్గదర్శకాల పేరిట చాలా మంది రైతులకు రుణమాఫీ ఫలాలు అందకుండా చేసింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన అర్హతలు, రేషన్ కార్డును ప్రామాణికమని చెప్పి ప్రతి గ్రామంలో 25 శాతం నుంచి 30 శాతం మందికే తొలి విడుతలో రుణమాఫీ చేసింది. ఒక కుటుంబంలో ఒకరికే రుణమాఫీ నిబంధనతో చాలా మంది నష్టపోయారు. కుటుంబంలో ముగ్గురు తీసుకుందామనుకుందాం.. ఈ ముగ్గురిలో ఒకరు రూ.50 వేలు, మరొకరు రూ.30 వేలు, ఇంకొకరు రూ.30 వేలు పంట రుణం తీసుకుంటే ముగ్గురి రుణం కలిపి రూ.1.10 లక్షలు అవుతున్నది. లక్ష లోపు రుణమాఫీతో ముగ్గురిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ వర్తించడం లేదు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో కార్డులు తీసుకోకుండా జాయింట్ ఫ్యామిలీలో ఉన్న వారు కూడా నష్టపోయారు. కిసాన్ సమ్మాన్ యోజన నిబంధనలు వర్తింపచేయడంతో ఐటీ చెల్లింపుదారులకు షాక్ తగిలింది.

### రైతు రుణమాఫీ కాదు.. కుటుంబ రుణమాఫీ..

రైతులకు రూ.2 లక్షల రూపాయల స్వల్పకాలిక రుణమాఫీ హామీ అటకెక్కింది. బ్యాంక్ రుణాలు, రేషన్‌కార్డులను లింక్ చేసి రైతు రుణమా రైతుల రుణమాఫీని కుటుంబ రుణమాఫీగా మార్చేశారు. ఇంతవరకు ఏ రుణమాఫీలో పెట్టని నిబంధనలకు తెరలేపిన అప్రదిష్టను కాంగ్రెస్ సర్కారు మూటగట్టుకుంది. కుటుంబం అనే నిబంధనతో చాలా మందిని నష్టం వాటిల్లింది. కొత్త రేషన్‌కార్డులు రాక, పాత వాటిలో మార్పులు-చేర్పులకు అవకాశం లేక విడిపోయిన రైతు కుటుంబాల పేర్లు ఒకే కార్డులో ఉన్నాయి. దీంతో ఉమ్మడి కుటుంబంలో విడివిడిగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి తీవ్ర నష్టం జరిగింది. రీ-షెడ్యూల్ చేసిన పంట అప్పులకు, లోన్ ఎలిజిబిలిటీ కార్డు కింద రుణమాఫీ వర్తించదని చెప్పడంతో మరికొంత మందికి రుణమాఫీ కోతలు తప్పడం లేదు. జిల్లాలవారీగా తొలి విడుత రూ.లక్ష లోపు రుణమాఫీ రైతుల జాబితాను విడుదల చేసిన అధికారులు, అసలు లక్షలోపు రుణం తీసుకున్నవారు ఎంతమంది ఉన్నారంటే మాత్రం చెప్పడం లేదు. అలాంటి జాబితానే లేదని చెప్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులను అడిగితే లీడ్ బ్యాంక్ వారిని లేదా బ్యాంకర్లను అడగమని చెప్తున్నారు. బ్యాంకర్లను అడిగితే వ్యవసాయ శాఖ నుంచి వచ్చిన జాబితా మేరకు రుణమాఫీ చేస్తున్నామని, ఇందులో తమరోల్ నామమాత్రమని చెప్తున్నారు. ఎవరికి వారు తప్పించుకునే సమాధానాలు తప్పితే ఎవ్వరూ స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో గందరగోళం నెలకున్నది. మరి ఇప్పటికైనా ప్రభు త్వం రుణమాఫీ కాని రైతులకు ఎందుకు మాఫీ చేయలేదనే వివరణ ఇస్తుందా? లేకపోతే మలి విడుతలో అవకాశం కల్పిస్తుందా? అనే విషయంపై స్పష్టత కరువైంది.

## 'చేతు'లు దులుపు కున్నారు!

### కేసీఆర్ హయాంలో షరతుల్లేకుండా వర్తింపు

కేసీఆర్ సర్కారు హయాంలో షరతుల్లేకుండా రుణమాఫీ చేశారు. గుంట భూమి ఉండి రు ణం తీసుకున్న వారిని రైతులుగా పరిగణించి రుణమాఫీ చేశారు. రైతుబంధుతో పంటకు పెట్టుబడి సాయం అందించి పెద్ద మనసును చాటుకున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మా ఫీ చేశారు. కానీ.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు రైతులను దగాకు గురి చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో ఇలాంటి షరతుల గురించి చెప్పకుండా ఇప్పుడు నిబంధనల పేరిట ప్లేట్ ఫిరాయించింది. పీసీసీ హోదాలో రేవంత్‌రెడ్డి రూ.2 లక్షలోపు రుణాలు తెచ్చుకుంటే అధికారంలోకి వచ్చిన వెంటనే మాఫీ చేస్తామని ప్రకటించారు. డిసెంబర్‌లో ప్రమాణ స్వీకారం కాగానే రుణ బాధలు తొలిగిస్తామని చెప్పారు. అనేక వాయిదాలు వేసుకుంటూ వచ్చి ఇప్పుడు నిబంధనల పేరిట రైతులకు న్యాయంగా దక్కాల్సిన రుణమాఫీకి అనేక కోతలు పెడుతున్నారు.

### నేను తీసుకున్న రూ.25 వేలు మాఫీ కాలే..



ఉట్నూర్ రూరల్,జూలై 18 : నేను 30 ఏండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నా. నాపేరు మీద ఎకరం 10 గుంటల భూమి ఉంది. నేను గ్రామీణ బ్యాంకులో రూ.25 వేల వ్యవసాయ రుణం తీసుకున్నా. ప్రభుత్వం చేసిన లక్ష రుణ మాఫీలో నాపేరు లేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మాత్రం మాఫీ చేసింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తామని, ఇప్పుడు మాలాంటి పేద రైతులకు రుణమాఫీ చేయలేదు. మేము యేటా బ్యాంకులో రుణం తీసుకుంటూ కడుతున్నాం. మేము ఉద్యోగాలు చేయడం లేదు. ఐటీలు కట్టడంలేదు. మాలాంటి రైతులకు కాకుంటే ఎవరికీ రుణమాఫీ చేస్తారో అర్థం కావడం లేదు. ప్రభుత్వం సర్వే నిర్వహించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

- చందనగిరి రాజేశ్వర్, రైతు, కొత్తగూడ గ్రామం.

### నేను అర్హుడిని.. జాబితాలో నా పేరు లేదు..



ఖానాపూర్, జూలై 18 : రేషన్‌కార్డు కచ్చితంగా అని చెప్పి రుణ మాఫీ చేయకపోవడం సరైన నిర్ణయం కాదు. నేను ఐదేండ్ల నాకున్న మూడెకరాల భూమిలో ఎవుసం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మూడేండ్ల క్రితం ఖానాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.90 వేల పంట రుణం తీసుకున్నా. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం లక్షలోపు పంట రుణం మాఫీ చేసిన లిస్టులో నా పేరు లేదు. ఈ ప్రభుత్వం నాలాంటి రైతులకు రుణమాఫీ చేయకుండా తీవ్ర అన్యాయం చేసింది. సర్కారు మాలాంటి రైతులపై దృష్టి సారించి రుణమాఫీ చేయాలని కోరుతున్నా.

- బావు రవి, రైతు, తర్లపాడు, ఖానాపూర్ మండలం

### సంబురాల్లో వర్గపోరు

చెన్నూర్ రూరల్, జూలై 18 : మంచిర్యాల జిల్లా చెన్నూర్ కాంగ్రెస్‌లో మరోసారి వర్గపోరు బహిర్గతమైంది. గురువారం స్థానిక రైతు వేదికలో రుణమాఫీపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం రుణమాఫీ సంబురాల్లో భాగంగా కొందరు కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేసేందుకు సిద్ధమవుతుండగా, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి అక్కడికి చేరుకుని అడ్డుకున్నాడు. తనకు చెప్పకుండా.. సంబురాలు ఎవరు చేయమన్నారంటూ అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు అయిత హిమవంతరెడ్డిపై మండిపడ్డాడు. పాలాభిషేకం కార్యక్రమాన్ని నిలిపివేయాలంటూ గొడవకు దిగాడు. ఈ నాయకుడి వల్ల చెన్నూర్ పట్టణానికి చెందిన పులువరు ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు ఇటీవల బీజేపీ పార్టీలో చేరారని తెలిపారు. డబ్బులు వసూళ్లు చేయడం, బియ్యం, ఇసుక దందా చేయడం వంటివి చేస్తున్నా.. ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంపై కాంగ్రెస్ నాయకుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. సదరు నాయకుడి ఆగడాలు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవ్వడం ఖాయమని నాయకులు మాట్లాడుకోవడం గమనార్హం.


ఓటింగ్ అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి వస్తూ విజయ సంకేతం చూపుతున్న చైర్మన్ జోగు ప్రేమేందర్, కౌన్సిలర్లు


మాజీ మంత్రి జోగు రామన్నను ఎత్తుకుని సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

# వైస్ చైర్మన్ ఔట్

## నెగ్గిన అవిశ్వాసం

- అనుకూలంగా 34 మంది ఓటు
- పదవి కోల్పోయిన జహీర్ రంజానీ
- రంజానీకి వ్యతిరేకంగా ఒక్కటైన అన్ని పార్టీల కౌన్సిలర్లు
- రసవత్తరంగా ఆదిలాబాద్ మున్సిపల్ రాజకీయం
- పటాకులు కాల్చి బీఆర్ఎస్ నాయకుల సంబురాలు
- రాక్షస పాలన అంతమైంది.. : మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు పెట్టిన అవిశ్వాసం నెగ్గిం ది. దీంతో ఆయన తన పదవిని మధ్యలోనే కోల్పోవాల్సి వచ్చింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 29వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన ఆయనను సభ్యులు వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వైస్ చైర్మన్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన చేరికను కొందరు కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించారు. జహీర్ రంజానీపై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకుల గత నెల 18న కలెక్టర్ రాజర్షి షాకు తీర్మానం అందించారు. తీర్మాన లేఖను పరిశీలించిన కలెక్టర్ గురువారం అవిశ్వాస సమావేశం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్‌ను ప్రిసైడింగ్ అధికారిగా నియమించి ఓటింగ్ అన్ని ఏర్పాట్లు చేశారు. అవిశ్వాస తీర్మానం ఎలాగైనా నెగ్గాలనే పట్టుదలతో నాయకులు బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లను క్యాంపునకు తీసుకెళ్లారు. కాంగ్రెస్ నాయకులు కూడా ఓటింగ్‌కు గైర్హాజరు అయ్యేలా తమ కౌన్సిలర్లను విహారయాత్రకు తరలించారు.

**అనుకూలంగా 34 మంది ఓటు**

అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించడానికి గురువారం ఉదయం 11 గంటలకు అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. క్యాంపులకు వెళ్లిన బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు సమావేశానికి నేరుగా హాజరయ్యారు. మున్సిపాలిటీ పరిధిలో 49 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 19 మంది కౌన్సిలర్లు, 9 మంది బీజేపీ, ఐదుగురు కాంగ్రెస్, ఒక ఎంఐఎం కౌన్సిలర్ కలిపి 34 మంది సభ్యులు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో వైస్ చైర్మన్ జహీర్ రంజానీ తన పదవి కోల్పోవాల్సి వచ్చింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.


జహీర్ రంజానీ

### అధికార పార్టీ అండతో అక్రమాలు

- మాజీ మంత్రి జోగు రామన్న

వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై అవిశ్వాసం నెగ్గడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుతున్నారు. మున్సిపాలిటీ పరిసర ప్రాంతాలు, బీఆర్ఎస్ కార్యాలయం లో పటాకులు కాల్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. వైస్ చైర్మన్ జహీర్ రంజానీ కాంగ్రెస్ పార్టీలో చేరి రాక్షస పాలన కొనసాగించారని, కౌన్సిలర్లు ఆయన ఆగడాలు సహించక అవిశ్వాసం పెట్టారన్నారు. అధికారపార్టీ అండతో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు తెలిపారు. సంబురాల్లో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ


చేతులెత్తిన కౌన్సిలర్లు

- చేజారిన మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి
- ఫలించని హస్తం పార్టీ నాయకులు పన్నాగాలు
- వ్యూహాత్మకంగా వ్యవహరించిన మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న హస్తం పార్టీ ఆదిలాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధిష్టానంతో పాటు జిల్లా నాయకులు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను ప్రలోభాలు గురి చేసి, పదవులను ఆశ చూపుతూ తమ పార్టీలోకి చేర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 29 వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన జహీర్ రంజానీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కాంగ్రెస్‌లోకి రావడాన్ని సహించని హస్తం పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి తెరలేపారు. ఇందుకు బీఆర్ఎస్, బీజేపీ, ఇతర సభ్యులు మద్దతు ప్రకటించారు. అవిశ్వాసం తీర్మానం ప్రకటన నేపథ్యంలో ఖంగుతిన్న కాంగ్రెస్ నాయకులు వైస్ చైర్మన్ పదవిని కాపాడుకునేందుకు ఇతర పార్టీల కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి తమ పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు చేశారు. పదవులు ఆశ చూపి తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న బీజేపీ కౌన్సిలర్ రాజేశ్‌ను తమ పార్టీలోకి చేర్చుకునే ప్రయత్నం చేయగా బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు.

### వ్యూహాత్మకంగా వ్యవహరించిన మాజీ మంత్రి రామన్న

పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై అవిశ్వాసం నెగ్గడంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు గులాబీ పార్టీ కౌన్సిలర్లతో పాటు ఓ కాంగ్రెస్ కౌన్సిలర్, ఎంఐఎం నుంచి కాంగ్రెస్‌లో చేరిన మరో కౌన్సిలర్‌ను తమవైపు తిప్పుకోవడంలో సఫలీకృతమయ్యారు. బీఆర్ఎస్‌కు చెందిన 19 మంది కౌన్సిలర్లతోపాటు ఐదుగురు కాంగ్రెస్, ఎమ్మెల్యేలతో క్యాంపు నిర్వహించారు. 24 మంది కౌన్సిలర్లు నేరుగా సమావేశానికి వచ్చి ఓటు వేసేలా ప్రణాళికలు రూపొందించారు. కాంగ్రెస్ నాయకులు పన్నాగాలు, ప్రలోభాలను దీటుగా ఎదుర్కొని అవిశ్వాసం విజయవంతం అయ్యేలా ముందుండి నడిపించారు. వైస్ చైర్మన్ పదవి చేజారడంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరాశ, నిస్పృహలకు గురయ్యారు. జిల్లా నాయకులు అసమర్థత కారణంగా బల్దియాలో కీలక పదవి కోల్పోవాల్సి వచ్చిందని, పరిస్థితులు ఇలాగే ఉంటే తమ భవిష్యత్ ఏమిటనే చర్చ హస్తం పార్టీలో జోరుగా కొనసాగుతున్నది.